క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అయిజ: దొంగలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో 6 మంది యువకులకు వారు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ముఖ్యంగా నిర్లక్ష్యరాసులను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసుకుంటున్నారని, ఆన్‌లైన్‌లో ఎలాంటి మోసాలు జరిగినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గట్టు: నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించే క్రమంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు ఏడీఈ గోవిందు, ఏఈ చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో మిట్టదొడ్డి, గొర్లఖాన్‌దొడ్డి లైన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, 11కేవీ లైన్, గొర్లఖాన్‌దొడ్డి, ఆరగిద్ద, పెంచికలపాడు, బల్గెర, మాచర్ల, గట్టు, గంగిమాన్‌దొడ్డి గ్రామాల్లో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులు సందర్శించారు. నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు



కేటీదొడ్డి: మండలంలోని మైలగడ్డ కాల్వ సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ఇబ్బందులు గమనించి ఎస్ఐ శ్రీనివాసులు గుంతలను మట్టితో పూడ్చించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అయిజ: బీఆర్ఎస్ నాయకుడు తిరుమలరెడ్డి 61వ జయంతి సందర్భంగా బుధవారం మండలంలోని ఉత్తనూరు గ్రామంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ జిల్లా వైస్ చైర్మన్ తాహేర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. యువత అధిక సంఖ్యలో పాల్గొన్ని రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని కోరారు.

రమాబాయికి ఘన నివాళి



అయిజ: అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రమాబాయి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక సంఘ సంస్కర్త అయిన రమాబాయి బీఆర్ అంబేడ్కర్ జీవితంలో ముఖ్యమైన స్థానాన్ని సంపాదించారన్నారు. ఆయన ఆశయ సాధనలో పాలుపంచుకున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆమె చేసిన త్యాగాలు, సమాజ సేవను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడికి నివాళి

శాంతినగర్: కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి వేడుకలు వడ్డేపల్లి మండలం జూలెకల్ గ్రామంలో మంగళవారం నిర్వహించారు. కుల రహిత సమాజం కోసం పాటుపడిన మహనీయుడని, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడారని, దురాచారాలపై ప్రజలను చైతన్యం చేయడానికి పత్రికను ఆయుధంగా వాడి సమాజానికి మేలు చేశారని గ్రామస్తులు కొనియాడారు. తెలుగుజాతికి నవయుగ వైతాళికునిగా సేవలందించిన గొప్ప వ్యక్తి అని జోహార్లు అర్పించారు.

సేంద్రియ సాగుపై అవగాహనేది ?

- అవగాహన కల్పించని వ్యవసాయ అధికారులు
- రసాయన ఎరువుల వైపు రైతుల మొగ్గు
- వెలవెలబోతున్న రైతువేదికలు



బైరాపురంలో ఓ పొలంలో నిలిపిన గొర్రెల మంద

ఉండవెల్లి: సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన లేకపోవడం, అధికారులు సరైన ప్రచారం చేయకపోవడంతో గ్రామాల్లో రసాయన ఎరువుల వినియోగం అధికమవుతుంది. దీంతో ఏటా పెట్టుబడులు పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అవగాహన సమావేశాలు నిర్వహించక రైతువేదికలు వెలవెలబోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సలహాలు, సూచనలు కరువు

సేంద్రియ వ్యవసాయంపై గ్రామాల్లో రైతులకు సలహాలు సూచనలు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం భిన్నంగా ఉంది. దీంతో పంటకు సోకిన రోగాలకు ఏ దశలో ఏ మందులు వాడాలో తెలియక, ఎరువులు వ్యాపారులు ఇచ్చే చవకబారు, నాణ్యతలేని నకిలీ మందులు వాడుతూ రైతులు నష్టపోతున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 18 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నారు. ఈ నేపథ్యంలో 15 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని రైతులు పేర్కొంటున్నారు.

పేరుకే రైతు వేదికలు

సేంద్రియ ఎరువుల తయారీ విధానం, వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంపై మండల వ్యవసాయ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు, రసాయన ఎరువుల వలన కలిగే నష్టంపై వివరించాల్సిన వ్యవసాయ అధికారులు మిన్నకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో సేంద్రియ సాగుపై అవగాహన కల్పించాలని మండల రైతులు కోరుతున్నారు.

రైతులు సతమతం



గ్రామాల్లో వ్యవసాయ పనులు మొదలైన నేపథ్యంలో అధికారులు మాత్రం రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడం లేదు. ఏ పంట సాగు చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. అధికంగా రసాయన ఎరువులనే పిచికారీ చేస్తున్నారు. తక్షణమే అధికారులు సేంద్రియ ఎరువులు, వ్యవసాయంపై అవగాహన కల్పించాలి.

- మద్దిలేటి, ప్రాగటూరు, రైతు

అవగాహన కల్పిస్తున్నాం



సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తాం. అందుబాటులో ఉండే పశువులు, గొర్రెల పేడను పొలాల్లో వేసుకోవాలి. జీవన ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది వరకు వర్మి కంపోస్టు బెడ్లు, వానపాములు వచ్చేవి. కానీ ప్రస్తుతం రావడం లేదు.

- అనిత, మండల వ్యవసాయధికారి, ఉండవెల్లి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఎంపీఓ జనార్దన్

అయిజ: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని, రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మరలేలా ప్రోత్సహించాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఈఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 250 ఎకరాల ప్రకృతి వ్యవసాయం చేయించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయన్నారు. పశువులు ఉన్న రైతులను గుర్తించి ప్రకృతి వ్యవసాయం చేయించే బాధ్యత ఏఈఓలదేనన్నారు. ఈ సందర్భంగా ఏఈఓలు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదన్నారు. దిగుబడి తక్కువగా వస్తుందని నష్టం ఎవరు భరిస్తారని మండిపడుతున్నారన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు విన్నవిస్తానని ఎంఏఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు



అలంపూర్‌లో పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

అలంపూర్/ఉండవెల్లి: మండలాల్లోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం సీఎం ఇంటి ముట్టడికి వెళ్తున్నారన్నా నేపథ్యంలో అలంపూర్ మండలంలోని మాజీ సర్పంచ్ అయ్యస్వామి, శ్రీనివాసులు, ఉండవెల్లిలో మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు లోకేశ్వర్ రెడ్డి, కంచుపాడు శేషన్‌గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. సర్పంచ్‌లుగా పదవిలో ఉన్న కాలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కానీ ఇప్పటి వరకు బిల్లులు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మహిళా సంఘాలతో ఆర్థికాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న జమున

గట్టు: లింగ సమానత్వం సాధించడం మహిళా సంఘాలతోనే సాధ్యమని సెర్ప్ మానవాభివృద్ధి సలహాదారు జమున అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో జెండా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాలు లింగ సమానత్వాన్ని సాధించడంలో కీలక పాత్రను పోషించాలన్నారు. మహిళా సాధికారతకు బాటలు వేసి, సమాజంలో వారి పాత్రను పెంచడానికి సంఘాలు సహాయ పడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడడానికి స్వయం సహాయ బృందాల రూపంలో పనిచేస్తాయన్నారు. సమాజంలో మహిళలకు సమాన హక్కులను కల్పించి, విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ప్రోత్సహించాలన్నారు. వేసవి శిబిరంలో భాగంగా స్నేహ సంఘాల్లో జరుగుతున్న అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెల్ఫ్ టీం సభ్యులు లింగమయ్యగౌడ్, ఏపీడీ నర్సింహ, రూతమ్మ, ఎల్లప్ప, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటేశ్వరి, మాజీ అధ్యక్షురాలు సత్యకళ, ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్, సీసీలు జ్యోతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృంద సమావేశం



అలంపూర్: పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీడీఓ పద్మావతి, సామాజిక తనిఖీ బృందం సీనియర్ రిసోర్స్ పర్సన్ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, తనిఖీ బృంద సభ్యులు హాజరయ్యారు. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3 కోట్ల ఉపాధి హామీ పనులు, పీఆర్ రూ.50 లక్షలకు సంబంధించిన తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: వాహనదారులు, ప్రజలు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరైనా ధ్రువపత్రాలు లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీస్‌లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు కూడలిలో ట్రైనింగ్ ఎస్ఐ వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో డ్రంకెన్‌డ్రైవ్, హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సీసీరోడ్లకు ప్రతిపాదనలు



అలంపూర్ ఆలయాల పరిసరాల్లో కొలతలు వేస్తున్న అధికారులు

అలంపూర్: దక్షిణ కాశీ క్షేత్ర ఆలయాల సముదాయంలో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అలంపూర్ క్షేత్ర ఆలయాల సముదాయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ రణవీర్ మంగళవారం సీసీరోడ్డు నిర్మాణాలకు కొలతను తీసుకున్నట్లు ఆలయ ఈఓ పురేంద్ర్‌కుమార్ తెలిపారు. ఆలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కొత్తగా కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాలతోపాటు నవబ్రహ్మ ఆలయాల సముదాయంలో సీసీరోడ్డు నిర్మాణాలు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా స్వామి, అమ్మవారి ఆలయాల చుట్టూ, వాహన పార్కింగ్ స్థలంలో సీసీరోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు కొలతలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బ్రహ్మయ్య ఆచారి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం..

అష్టాదశ శక్తి పీఠాల్లో ఐదవ శక్తిపీఠ క్షేత్రమైన అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో మంగళవారం చండీహోమం నిర్వహించారు. అమావాస్య కావడంతో ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలొచ్చారు. అమ్మవారు, స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షేమ పథకాలు అందించడానికి కృషి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. రాజోళి మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన మేడికొండ సుబ్బమ్మకు రూ.16,500 తూర్పుగార్లపాడు గ్రామానికి చెందిన మోరెడ్డికి రూ.12 వేల విలువైన చెక్కు అందజేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

వల్లూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కిషోర్ తల్లి మరియమ్మ కర్నూల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అదే విధంగా పుల్లూరు గ్రామానికి చెందిన దేవికారాణి మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారిని ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

నిబంధనలకు లోబడి వైద్యం చేయాలి



తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

కేటీదొడ్డి: ఆర్ఎంపీలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వైద్యం చేయాలని డీఎంహెచ్ఓ సిబ్బంది (ఇన్‌చార్జ్ డిప్యూటీ డెమో) మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా మంగళవారం మండలంలోని నందిన్నె గ్రామంలోని శివప్రసాద్‌గౌడ్‌కు చెందిన క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ఎంపీ క్లినిక్‌లో మందులు, సిరప్‌లు, ఇంజెక్షన్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. నందిన్నె గ్రామంలోని ప్రథమ చికిత్సలు అందిస్తున్న నిర్వాహకుల వద్ద మెడిసిన్స్ ఎక్కువ మొత్తంలో ఉన్నందున సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రథమ చికిత్స కేంద్రాలపై డాక్టర్ సింబల్, ప్లస్ మార్క్ రాయకూడదని హయ్యర్ యాంటీబయాటిక్స్, స్టిరాయిడ్స్ మందులు రోగులకు ఇవ్వకూడదన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఉన్నవారికి చికిత్స చేయకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని ఢీకొన్న వాహనం గుర్తింపు

ఉండవెల్లి: మండలంలోని శాంతినగర్ వైపు నుంచి అలంపూర్ చౌరస్తాకు వెళ్తున్న నారాయణ అనే వ్యక్తిని ఈనెల 24న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం అనంతపురం జిల్లా కేంద్రంలో పోలీసులు సీసీ కెమెరాల ద్వారా బొలెరో వాహనాన్ని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని గుర్తించిన కానిస్టేబుల్ నగేష్, రవీంద్రను ఎస్ఐ మహేష్ అభినందించారు.

దవాఖానా అందుబాటులోకి తేవాలి



నిరసన తెలుపుతున్న జూలెకల్ గ్రామస్తులు

శాంతినగర్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించడానికి నిర్మించిన పల్లెదవాఖానా ప్రారంభానికి నోచుకోవడం లేదంటూ ప్రజలు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో రెండేళ్ల క్రితం పల్లె దవాఖానా నిర్మాణం చేపట్టారని, 90 శాతం వరకు పనులు పూర్తి చేసి పనులు నిలిపేసినట్లు పేర్కొన్నారు. మారుమూలన ఉన్న గ్రామంలో దవాఖానా లేక వడ్డేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని లేక ప్రైవేటు వైద్యులను సంప్రదించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆస్పత్రి ప్రారంభించి వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కోరారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ



కేటీదొడ్డిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న కుర్వ హనుమంతు

మల్దకల్/కేటీదొడ్డి: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో మంగళవారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను రైతులకు ఏడీఏ సక్రియనాయక్, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలానికి మొత్తం 133 బస్తాల జీలుగ విత్తనాలు వచ్చినట్లు వారు తెలిపారు. 30 కేజీల బస్తా రూ.2,137కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు విష్ణు, సీఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- రైతులకు కావల్సిన జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు అన్నారు. కేటీదొడ్డి మండల కేంద్రంలోని రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ సాజీద్ రెహమ్మాన్, ఏఈఓ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఇటిక్యాలలో యోగా చేస్తున్న వైద్య సిబ్బంది

మల్దకల్: యోగ చేయడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారవచ్చని వైద్యురాలు స్వరూపరాణి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో యోగా చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిరోజు యోగ చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. నిత్య జీవితంలో యోగా ఓ భాగం కావాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీధర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

ఇటిక్యాల: ప్రతిరోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంఎల్‌హెచ్‌పీ అనూష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిబ్బందితో కలసి యోగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ఎన్ శోభరాణి, ఎస్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



డి.బూడిదపాడులో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

మల్దకల్/ధరూరు/మానవపాడు/ఎర్రవల్లి/ఉండవెల్లి: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అమావాస్యను పురస్కరించుకుని గద్వాల పట్టణంలోని కాకతీయ టెక్నో స్కూల్ యాజమాన్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, సీతారామిరెడ్డి, మధుసూదన్‌రెడి, తదితరులు పాల్గొన్నారు.

- ధరూరు మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కిష్టాచార్యులు తెలిపారు.
- మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో అన్నదానం చేశారు.
- అమావాస్యను పురస్కరించుకొని ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో భక్తులతో రద్దీగా మారింది. అర్చకులు ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఆకుపూజ, అభిషేకం వంటి క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- ఉండవెల్లి మండలంలోని డి.బూడిదపాడు ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో అన్నదాన చేశారు. ఆకుపూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



పెద్దచింతరేవుల ఆలయంలో భక్తుల రద్దీ



బీచుపల్లి ఆలయంలో..